క్లుప్తంగా

నేడు రైతు వేదికలో సీఎం కార్యక్రమం ప్రసారం

కొత్తూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో సోమవారం ప్రారంభించనున్నట్లు ఏఓ గోపాల్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రైతుల ప్రయోజనాల గురించి సీఎం ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని తిమ్మాపూర్, ఇన్ముల్‌నర్వ గ్రామాల్లోని రైతులు రైతువేదికలోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించాలని కోరారు.

చేవెళ్లలో..

చేవెళ్ల: ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలంలోని రైతు వేదికలో సోమవారం ప్రసారం చేయనున్నట్లు, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శంకర్‌లాల్ తెలిపారు. ఈ ఏడాది వానాకాలం సీజన్ రైతు భరోసాను ప్రభుత్వం ప్రారంభించనుందని తెలిపారు. చేవెళ్ల మండలంలోని ఖానాపూర్, ఆలూరు, చేవెళ్ల రైతు వేదికల వద్ద సాయంత్రం 3 గంటలకు ప్రారంభం కానున్న ఈ ప్రత్యేక ప్రసార కార్యక్రమాన్ని రైతులు సకాలంలో హాజరై వీక్షించాలని కోరారు.

మొయినాబాద్: మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి సెక్టార్ రైతు వేదికలో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌ను ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయాధికారి అనురాధ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వీసీ యూనిట్ ప్రారంభోత్సవం జరుగనుందని పేర్కొన్నారు.

హామీలు అమలు చేయాలి

బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు నర్సింహ యాదవ్

కేశంపేట: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు పసుపుల నర్సింహాయాదవ్ పేర్కొన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇందిరమ్మ ఇళ్లను అనర్హులకు మంజూరు చేస్తున్నారని ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ధరణీ స్థానంలో భూ భారతి తెచ్చిన రైతుల సమస్యలు నేటికి పరిష్కారం కావడం లేదని ఆయన ఆరోపించారు. అసైన్డ్ భూముల రైతులు మరణిస్తే నేటికి విరాసత్ చేయడం లేదని తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకంతో రాష్ట్ర ప్రభుత్వం యువతను తప్పుదోవ పట్టిస్తుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం హామీలను అమలు చేయకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి ఉద్యమాలను చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా బొడ్రాయి పూజలు



పూజలో గ్రామస్తులు

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని సోలిపూర్ గ్రామంలో ఆదివారం ఘనంగా బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం బోనాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సునీల్, వెంకటేశ్వర్‌రావు, అభిషేక్, సింగపాగ లక్ష్మయ్య, శివరాములు యాదవ్, రాజేష్‌గౌడ్, అనిల్‌కుమార్, చీపిరి వెంకటేశ్ యాదవ్, రమేశ్ యాదవ్, సతీశ్, ఆంజనేయులు, కృష్ణయ్య, అంజయ్య, అంజిరెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం



భరద్వాజ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు

షాద్‌నగర్: సివిల్స్‌లో 905వ ర్యాంకు సాధించిన పట్టణంలోని డ్రీమ్ ల్యాండ్ కాలనీలో నివాసం ఉంటున్న భరద్వాజ్ ఇంటింటికి ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి వెళ్లి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కానుగు అనంతయ్య, నందకిషోర్, దినేష్ సాగర్, అన్మారి రాజు,పాల్గొన్నారు.

అతివేగం ప్రమాదకరం

- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు
- గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు



కుర్మిద్దలో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ, సిబ్బంది

యాచారం: అతివేగం ప్రమాదకరమని, రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు హెచ్చరించారు. పీఎస్ పరిధి కుర్మిద్ద గ్రామం, తాడిపర్తి– మీరాఖాన్‌పేట గ్రామాల మధ్య ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు డ్రైవింగ్ లైసన్సులు కలిగి ఉండాలని సూచించారు. ఎస్‌ఐ తేజంరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలమయం.. గూడూరు రోడ్డు!

అదుపు తప్పితే అంతే సంగతులు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



కంకరతేలి గుంతలుగా మారిన రోడ్డు

కొత్తూరు: పట్టణాలకు పల్లెలే పట్టుకొమ్మలు. పల్లెలు బాగుంటేనే దేశం బాగుటుంది. పల్లెల్లో మౌలిక వసతుల కల్పన కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని తరచూ పాలకులు ప్రసంగాలు చేస్తున్నారు. కానీ వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఇప్పటికీ కొన్ని గ్రామాలు, అనుబంధ తండాల్లో రోడ్లు కరువయ్యాయి. సరైన రోడ్డు వ్యవస్థలేక, రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. మరికొన్ని గ్రామాల్లోని రోడ్లు ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోక కంకరతేలి గుంతలుగా మారాయి. దీంతో ఆవైపుగా వెళ్లే వాహనదారులకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. కొత్తూరు జాతీయ రహదారి నుంచి మల్లాపూర్ మీదుగా గూడూరు వెళ్లే ప్రధాన రోడ్డు ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఇప్పటికే కంకర తేలి, గుంతలు పడ్డాయి. ఈ రోడ్డుపై నుంచి ప్రయాణిస్తు పలువురు ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. జాతీయ రహదారి నుంచి గూడూరు వరకు ఉన్న ప్రధాన రోడ్డు పదుల సంఖ్యలో ఆయా గ్రామాలను కలుపుతుంది. దీంతో నిత్యం ఈ రోడ్డుపై నుంచి భారీ సంఖ్యలో వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. అత్యవసర సమయాల్లో వెళ్లే వాహనదారులు గుంతల రోడ్డుతో ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దానికి తోడు ఏమాత్రం అజాగ్రత్తగా వాహనాలు నడిపినా అంతేసంగతులు. అదుపుతప్పితే ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొందని మల్లాపూర్, గూడూరు గ్రామాలకు చెందిన ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు పనులు చేయించాలని కోరుతున్నారు.

అభివృద్ధికి కృషి

చేవెళ్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ మాలతి

మొయినాబాద్ రూరల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలల అభివృద్ధికి అందరం కృషి చేయాలని చేవెళ్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ మాలతి అన్నారు. మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలోని చేవెళ్ల గురుకుల పాఠశాల వేసవి సెలవుల అనంతరం పునః ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా 5వ తరగతిలో, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులకు కళాశాల అధ్యాపకులు స్వాగతం పలికారు. జోనల్ అధికారి నిర్మల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. వారి సౌకర్యార్థం తల్లిదండ్రులతో మాట్లాడుకునేందుకు ఫోన్ మిత్ర కార్యక్రమం ద్వారా ఫోన్ సౌకర్యం కల్పించారన్నారు. కిచెన్, గార్డెన్‌లో భాగంగా స్కూల్లో పలు రకాల కూరగాయలు, మొక్కల సాగుతో బాల్యంలోనే సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఈట్ రైట్ కార్యక్రమం ద్వారా ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు వాటిలోని పోషకాల విలువలు తెలిసే విధంగా ఆయా కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. భవిష్యత్‌లో సాంకేతిక రంగంలో రాణించేవిధంగా తగిన శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా ప్లాస్టిక్‌పై అవగాహన, స్పోర్ట్స్, ప్రయోగశాలలు, భోజన సదుపాయాలు, వివిధ అంశాలపై మెళకువలు బోధిస్తారన్నారు.



విద్యార్థినులకు స్వాగతం పలుకుతున్న జోనల్ అధికారి నిర్మల, అధ్యాపక బృందం

సమస్యకు పరిష్కారం

- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట మట్టిపోయించిన దాత వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: చేవెళ్లలోని ప్రభుత్వ జిల్లాపరిషత్ బాలికల పాఠశాల ముందు చేరిన వర్షపునీటిలోనుంచి విద్యార్థులు స్కూలుకు వెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులను ఓ దాత ముందుకు వచ్చి పరిష్కరించారు. పాఠశాల ముందు వర్షపునీరు నిండడంతో సమస్యలతో స్వాగతం అని 13వ తేదీన సాక్షి పత్రికలో వచ్చిన కథనంపై చేవెళ్లకు చెందిన పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి స్పందించారు. స్వచ్ఛందంగా ఆయన సొంత నిధులు వెచ్చించి పాఠశాల గేట్ ముందు మొరం మట్టి పోయించి నీళ్లు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకున్నారు. దాత వెంకట్‌రెడ్డి వెంటనే స్పందించి శనివారం మట్టి పోయించినందుకు మండలంలోని ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆయనను చేవెళ్ల సోషల్ మీడియ వే దికగా ప్రత్యేకంగా అభినందించారు.



సాక్షి ఎఫెక్ట్..

వర్షపునీరు నిల్వ ఉండకుండా పోయించిన మొరం మట్టి



కొందుర్గు: నియామక పత్రం అందిస్తున్న బర్క కృష్ణయ్య

బీసీ హక్కుల సాధనే లక్ష్యం

కొందుర్గు: బీసీలందరూ హక్కుల సాధనే లక్ష్యంగా పనిచేయాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయ్య పేర్కొన్నారు. ఆదివారం బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు అనిత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జనాభాలో 50 శాతానికి పైగానే ఉన్న బీసీలు సమస్యల పరిష్కారానికి సంఘటితం కావాలన్నారు. జనాభా దామాషాన విద్య, ఉద్యోగ, రాజకీయ, సామాజిక రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.

మండల అధ్యక్షుడిగా రమేశ్

బీసీసేన కొందుర్గు మండల అధ్యక్షుడిగా ఐలపురం రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా గౌరి శంకర్, ప్రధాన కార్యదర్శిగా చిన్న రాజు గౌడ్, కార్యదర్శిగా నర్సింలు, కోశాధికారిగా శ్రీను ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సుధాకర్, నాయకులు సుధాకర్ రావు, చంద్రస్వామి, బుచ్చిలింగం, ఎల్లప్ప, చంద్రశేఖర్, మల్లేశ్ పాల్గొన్నారు.



మొయినాబాద్ చౌరస్తాలో జెండా ఆవిష్కరిస్తున్న రామేశ్వరయ్య

బీసీ కులాల అభివృద్ధే ధ్యేయం

మొయినాబాద్ రూరల్: బీసీ కులాల అభివృద్ధే ధ్యేయమని సాధన సమితి ఉపాధ్యక్షుడు, చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి సంగం రామేశ్వరయ్య పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా మొయినాబాద్ చౌరస్తాలో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉప్పరియాదయ్య సాగర్, సాంబసాగర్ తదితరులు పాల్గొన్నారు.

గో సేవతో పుణ్యం

మాజీ కౌన్సిలర్ లతాశ్రీ



శ్రీకృష్ణ గోశాలకు గడ్డి అందజేస్తున్న దాతలు

షాద్‌నగర్ రూరల్: గో మాతకు సేవచేస్తే ఎంతో పుణ్యమని మాజీ కౌన్సిలర్ లతాశ్రీ శ్రీశైలం పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం మోతీఘణపూర్ గ్రామానికి చెందిన బండ వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మమ్మ ఆదివారం పట్టణ సమీపంలోని చౌడమ్మగుట్ట ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ గోశాలకు గడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ లతాశ్రీ శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. గో మాతను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనని పేర్కొన్నారు. గో సంతతి అంతరించిపోకుండా గోవులను రక్షించుకోవడం అందరి బాధ్యతని తెలిపారు. ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకొని సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. నోరులేని మూగజీవాల రక్షణకు సహాయ సహకారాలు అందించాలన్నారు. అనంతరం గడ్డి వితరణ చేసిన దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు సింగపాగలక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎస్కే విల్లాస్ నూతన కమిటీ

అధ్యక్షుడిగా మహేశ్‌గౌడ్



మహేశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న సభ్యులు

షాద్‌నగర్ రూరల్: పట్టణంలోని సీఎస్కే విల్లాస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం సీఎస్కే విల్లాస్ పార్కులో నిర్వహించారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా అరటియాదయ్య, అధ్యక్షుడు బంటారంమహేష్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా ఇంజమూరిగోపాల్ రమేశ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, అరుణ, భాగ్యలక్ష్మి, ప్రధాన క్యాదర్శిగా ప్రసన్న, సహాయ కార్యదర్శులుగా భిక్షపతి, దత్తాత్రేయ, నాగిళ్లకిషోర్, ప్రశాంత్, రాఘవేందర్‌రెడ్డి, సునీత, న్యాయ సలహాదారులుగా ఇంజమూరి నర్సింలు, హరికిషన్, హరీశ్, మీడియా ఇంచార్జిలుగా రాఘవేంద్రగౌడ్, సందీప్‌గౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం కాలనీ వాసులు నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.

భట్టి విక్రమార్కకు జన్మదిన శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న భీంభరత్ తదితరులు

షాబాద్: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు చేవెళ్ల అసెంబ్లీ ఇంచార్జి పామెన భీంభరత్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం నగరంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు పామెన నర్సింహులు, మంగలి చెన్నయ్య, కొమరబండ దేవాలయ చైర్మన్ చేవెళ్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం



బహుమతులు అందజేస్తున్న ఇనాయత్, కాంగ్రెస్ నాయకుడు రాజు

షాబాద్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని శ్రీసాయి చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు ఏండీ ఇనాయత్, కాంగ్రెస్ నాయకులు రాజు పేర్కొన్నారు. ఆదివారం బోడంపహాడ్ గ్రామంలో మూడు వారాలుగా సమ్మర్ ఛాంపియన్స్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడూతూ..క్రీడలతో మానసికోల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బందేశ్వర్, హరి, మల్లేశ్, రఫీక్, భాస్కర్‌రెడ్డి, విష్ణు, శివ, శ్రీశైలం, నరేష్, అంజాద్, పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

కొందుర్గు: అర్హులైన రైతులందరూ రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజేందర్ రెడ్డి సూచించారు. ఈ ఏడాది జూన్ 5వ తేదీ వరకు కొత్త పట్టాదారు పాసుపుస్తకం తీసుకున్న వారందరు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం జతచేసి సంబంధిత ఏఈఓకు అందజేయాలని సూచించారు.

ఈ నెల 18 వరకు..

శంకర్‌పల్లి: అర్హులు ఈ నెల 18వ వరకు దరఖాస్తు చేసుకోవాలని శంకర్‌పల్లి మండల వ్యవసాయాధికారి సురేశ్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: రైతు భరోసా పథకానికి ఈ నెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అనురాధ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొయినాబాద్ క్లస్టర్ పరిధిలోని రైతులు ఏఈఓ సునీల్, కేతిరెడ్డిపల్లి క్లస్టర్ పరిధిలో ఏఈఓ కుమార్ నంబర్లపై 6305910249, 6305910250 సంప్రదించాలని కోరారు.

నందిగామలో..

నందిగామ: గతంలో దరఖాస్తు చేసుకోని రైతులు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారి రవి కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 5వ తేదీ వరకు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతులు ఈ పథకానికి అర్హులని వివరించారు.

చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

మొయినాబాద్: ప్రభుత్వం పెంచిన ఆర్టీసీ బస్‌పాస్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు క్యామ పద్మనాభం డిమాండ్ చేశారు. ఆదివారం మొయినాబాద్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బస్‌పాస్ చార్జీల పెంపుతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు, విద్యార్థులపై తీవ్ర భారం పడుతుందన్నారు. వెంటనే పెంచిన చార్జీలను ఉపసంహరించుకోవాలని కోరారు.

పేదింటి బిడ్డ చదువుకు 'ఉప్పల' అండ

ఆమనగల్లు: తాళ్లగుట్టతండా నిరుపేద బాలిక చిట్టి చదువులకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అండగా నిలిచారు. గతేడాది 6, ప్రస్తుతం 7వ తరగతికి చేయూతనందించారు. ఈ ఏడాదికి అవసరమైన ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

షాద్‌నగర్ రూరల్: పట్టణంలోని ప్రగతి విద్యాలయం ఉన్నత పాఠశాలలో 2004–05లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని నాగుపల్లి సమీపంలో ఓ రిసార్ట్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 సంవత్సరాల తరువాత కలుసుకున్న వారు ఒకరినొకరు ఎంతో ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాలలో చేసిన అల్లరిపనులను, జ్ఞాపకాలను, అనుభవాలను స్మరించుకున్నారు. ఉద్యోగ, వ్యాపార నిమిత్తం కుటుంబ బాధ్యతలతో తీరిక లేకుండా ఎక్కడెక్కడో ఉన్నప్పటికీ బాల్య స్నేహితులను కలుసుకోవడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల వ్యవస్థాపకుడు రాధాకృష్ణారావు, ఉపాధ్యాయులు నరేందర్‌రావు, శశికాంత్, రఫత్‌సుల్తానా, అనురాధ, ఇందిర, బాల్‌రాజ్, అజయ్‌కుమార్‌ను పూలమాలలు వేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రవీణ్‌కుమార్, మల్లిఖార్జున్, సిద్దిబాబు, అమర్‌నాథ్, శిరీష, జోస్న, దీప, విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కసిరెడ్డి పరామర్శ



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, నాయకులు

కడ్తాల్: విశ్రాంత ఉద్యోగి కడారి శివరాజ, నార్లకంటి మల్లేశ్‌లు ఇటీవల మృతిచెందారు. ఈ మేరకు ఆదివారం బాధిత కుటుంబాలను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు బాలాజీసింగ్ తదితరులు పరామర్శించారు. ఇందులో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్: అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధి 74 మందికి రూ.32 లక్షల 16వేల 500ల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు ఆపత్కాలంలో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్: ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం కింద మండల పరిధి బాటసింగారం గ్రామానికి చెందిన పిట్టల సహదేవకు రూ.60 వేలు, ఎండీ గాలీబ్‌కు రూ.39, వేలు రామసామి సుశీల రూ.60 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం బాధితులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చెక్కులు అందజేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర చారి, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.